# ఉగాది మినీకథల పోటీలో కన్సొలేషన్ బహుమతి రూ. 75/- పొందిన కథ




ఉదయం ఎనిమిది సైరనూది అప్పుడే గంటన్నరయింది. సన్నాసప్పడికేం చేయాలో పాలుపోవడంలేదు. ఆ రోజు కూడా ఏ ట్రైనూ రాలేసు.

సన్నాసప్పడు రైల్వేస్టేషన్లో కళాసి. రెండ్రోజుల క్రితమే ఎక్కడో రైల్వేలైన్లు పాడవటంతో ట్రైన్ల రాకపోకలు ఆగిపోయాయి. దాంతో సన్నాసప్పడికి పన్నేకుండాపోయింది.

ఏపాటూ లేకున్నా సాపాటు తప్పదు. రెండ్రోజులుగా సన్నాసప్పడు నూకరాజు కొట్టుమీద బియ్యం, పప్పులు అరువు తీసుకొంటున్నాడు. ఈ రోజుకూడా "అరువొట్టమ్మని" భార్య రావుడమ్మను నూకరాజు కొట్టుకి పంపించేడు. అయితే నూకరాజీ రోజు అరువివ్వటాని కిష్టపడలేదు. "ఇప్పటికే యిరవై రూపాయలు మీరు బాకీపడ్డారు. ఇక అరువు నేనివ్వలేను. ఆ బాకీ తీర్చేసి అరువు తీసికెళ్ళండి" అన్నాడు.


సన్నాసప్పడి కేవీఁ తోచలేదు. ఉదయం నుంచీ పొయ్యిలో పిల్లులు పడుకున్నాయి. "ఏటిసారి?" సన్నాసప్పడి బుర్రనిండా "ఆలోసెన్లు." ఇంతలో—

"ఇదుగోండి! ఇందు మూలముగా తెలియపరిసే దేమంటే - అమ్మతల్లి గుడికాడ ఈ రోజూ, రేపూ పంచదార కోటా యిత్తన్నారు. కాబట్టి కార్డులొట్టుకొని రావాలిసిందిగా కోరడమైందొహో...." అంటూ ఊరు జారికి దండోరా వేస్తున్నాడు.

"ఓరయ్యా! పంచదార కోటా యిత్తన్నారట్రా!" ఎక్కడ్నించో పరిగెత్తుకుంటూ వచ్చి సన్నాసప్పడితో చెప్పాడు ఎనిమిదేళ్ళ వాడి కొడుకు "సిట్టిబాబు."

సన్నాసప్పడి మనసులో ఓ ఆలోచన మెరిసింది.

"పంచదార కార్డు ఒక సంవచ్చరం పాటు నూకరాజుబాబుకి తనకా ఎడితే?" ఆ ఆలోచన బాగున్నట్టనిపించింది. రావుడమ్మతో చెప్పాడు "అలాగ సేత్తే ఆయన బాకీ తీరిపోగా ఈ పూటకి బియ్యం గింజలుకూడా వత్తాయి. మొన్న అప్పన్న కూడా ఆ పనే సేసినాడు. ఏటి? తనకా ఎట్టేమంతావా కార్డు?" అని అడిగాడు. రావుడమ్మ "నీ యిట్టమే" అంది. సిట్టిబాబుకేదో సందేహం వచ్చింది. "ఆ కార్డు తనకా ఎడితే ఇరవై రూపాయలప్పు తీరిపోద్దా? అబ్బా! అసలా కార్డుకంత యిలువేట్రా? అది కొనుకోని ఆ నూకరాజు బాబేటి సేత్తాడేటి?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించేడు.



## నా గురించి

పూర్తి పేరు- పతివాడ నాస్తిక్. జననం 10-12-1956. పుట్టడం వీరఘట్టంలో అయినా ఊహ తెలిసిన్నాటినుంచీ పార్వతీపురంలోనే నివాసం. ప్రస్తుతం పార్వతీపురం డిగ్రీ కళాశాలలో బి. ఏ. మూడవ సంవత్సరం చదువుతున్నాను.

శ్రీశ్రీ సాహిత్యమన్నా, కాళీపట్నం రామారావు మాష్టారి కథలన్నా చాల యిష్టం. కొడవటిగంటి, రాచకొండగార్లు నా అభిమాన రచయితలు.

సాహిత్యం జీవితాన్ని ప్రతిబింబించడంతో సరిపోదు. దాన్ని వ్యాఖ్యానించాలి— అనేది నా అభిమతం. ఇంతవరకు నేను పెద్దగా ఏవీఁ వ్రాయలేదు. వ్రాసిన ఒకటీ అరా రచనలు ప్రచురితం కాలేదు. కాబట్టి నాగురించి ప్రస్తుతానికేవీఁ లేదనే చెప్పాలి. మీరు కోరినట్టుగా ఈ కథతో పాటు నా ఫొటో కూడా పంపిస్తున్నాను.

—నాస్తిక్

సన్నాసప్పడికి నవ్వొచ్చింది. "ఆ బాబేం బతుకెరక్క కార్డు కొన్డం నేదురా! ఆ కార్డు తోటి కోటా పంచదార సవగ్గా కొని, ఆల కొట్లో నాబాని కమ్ముకుంతాడు" అన్నాడు.

"అయితే మనిమెందు కాయిన కమ్మడం?"

"అవుసురుం గాబట్టి. అయినా ఏనంత నేవు. నీకెందుకురా ఆయన్నీ? ఎల్లాడుకో!" అంటూ పెట్లోని పంచదార కార్డు

తీసి లాల్చీ జేబులో పెట్టుకుంటూ బయలు దేరాడు. సరాసరి నూకరాజు కొట్టుకెళ్లాడు. పంచదార కార్డు సంవత్సరంపాటు పాత బాకీ కింద తనఖా "ఇదుకొని" ఓ రెండు కేజీల బియ్యం, పప్పు, ఉప్పు, చింతపండూ ఇమ్మన్నాడు.

పంచదార కార్డు చూసి నూకరాజు కళ్ళు తళుక్కున మెరిశాయి. మనసులో లెక్క వేసుకున్నాడు.

"పంచదార మార్కెట్‌లో కేజీ ఆరూ ఏభై పైసలు. అదే కోటాలో అయితే మూడూ అరవై పైసలు. సన్నాసప్పుడి 'సి' కార్డుకు నెలకు రెండు కేజీల పంచదార రొస్తుంది. అంటే ఒక నెలకోటా తను మార్కెట్ ధరకమ్మితే అయిదూ ఎనభై పైసలు లాభం అన్నమాట. అదే సంవత్సరానికయితే మొత్తం (5-80×12) అరవై తొమ్మిది రూపాయల అరవై పైసలు లాభవొస్తుంది. ఓహ్!....చాల బావుంది" అనుకున్నాడు. వెంటనే సన్నాసప్పుడితో—

"సరే.... కాని ఇపుడు తీసికెళ్ళబోయే సామాన్లుమాత్రం ఖాతాలో వేస్తాను" అన్నాడు.

సన్నాసప్పుడికి మండు కొచ్చింది. "అలా కుదరదు. బాకీ తీరిపోను ఈ సామాన్లుకూడా యియ్యాల. పొయ్యిమీదకి బియ్యం నేవనిగాని, నేకపోతే నాను కార్డు తనకా యెడతానేటి?" అన్నాడు.

నూకరాజు వచ్చిన లాభం చాలను కున్నాడో ఏమో, "సరేలేరా!" అంటూ సామాన్లు కొలిచాడు.

* * *

"ఓరయ్యా! మన తెల్లకోడి పెట్టని సైకిలు మట్టేసింది" రోడ్డుమీదనుంచే కేకే శాడు సిట్టిబాబు.

నులక మంచం మీద కూర్చొని 'రేపెలాగా?' అని ఆలోచిస్తున్న సన్నాసప్పుడు దిగ్గునలేచి ఎదురుగావున్న రోడ్డు మీదికొచ్చాడు. కోడిపెట్ట మట్టించేసిన సైకిలిస్టు తప్పించుకుపోవాలని మరి కొంచెం స్పీడుఎక్కువ చెయ్యడంచూసి. కోపంతో పరిగెత్తెళ్ళి ఆపాడు. సైకిల్ హేండిల్ బారుమీద చెయ్యేసి—

"కళ్ళు నెత్తికెక్కాయా? మాదరోచ్చోదు నాకొడకా! ఇది కోడిపిల్లయిపోయింది. మనిసైనా యింతేనేటి? మరియాదగా ఇరవై రూపాయిలిచ్చి, ఆ కోడిపెట్టొటి కెలిపో!" అని గదమాయించేడు.

ఇంతలో రావుడమ్మ కూడా చేస్తున్న వంట వనాపేసి, "ఓలమ్మో లమ్మో! బంగారంనాటి కోడిపెట్టని బలివిని సంపేసినాడు" అంటూ రోడ్డు మీది కొచ్చింది. అక్కడే వున్న సిట్టిబాబుని ఇంట్లో కుక్కలు దూరిపోకుండా సూడమని చెప్పి పంపేసింది.

ఇంతకీ ఆ సైకిలిస్టు ఓ బియ్యే స్టూడెంటు. బొండపల్లి నుంచి పార్వతీపురం డిగ్రీ కాలేజీకి సైకిల్మీదొస్తూ, లైటైపోతుందన్న గాబరాలో సన్నాసప్పుడి కోడిపెట్ట మట్టించేశాడు. అసలు దాన్ని తప్పించుకోవాలని తెగ ప్రయత్నించేడు కూడా. కాని సైకిలెటు తిప్పితే అదీ అటే తిరిగి, ఆఖరికి చక్రం కింది కెళ్ళి పోయింది. ఆ విషయమే చెప్పాడు.

"నేను దాని మట్టించాలని మట్టించలేదు. సైకిలు కడ్డంగావస్తే నేనేం చేసేది?" అన్నాడు.

రావుడమ్మ కస్సున లేచింది. "ఓలమ్మో అమాయికం సైకిలు కడ్డంగా వొత్తే బేకుల్నేటి? తిన్నగా యిరవై రూపాయిలూ యియ్యి నేదంటే యిలా కోడి పెట్టయినా తెచ్చియ్యి. అదీ నేదు, ఇదీ నేదంటే సైకిలొగ్గేసెలిపో!" అంది.

సరిగ్గా అదే సమయానికి ఆ వాసలో వున్న మరో ముగ్గురు ఆడా, మగా రోడ్డు మీదికొచ్చి "టూడెంటుకు(రోడ్ని" తిట్టడం మొదలెట్టారు.

పాపం బియ్యే స్టూడెంటు బిక్కమొగం వేశాడు. తప్పదన్నట్టు జేబులోంచి పది రూపాయల్నోటు తీశాడు. ఏదో ఫీజు కట్టాలని వాళ్ళ నాన్న దగ్గర ఆ రోజు అబద్ధం చెప్పి సంపాదించిన నోటది. దాన్ని సన్నాసప్పుడి కందించి "నా దగ్గరింతే వుంది" అన్నాడు. సన్నాసప్పుడు "చెస్ పదెవడి గ్గావాలి?" అంటూ తిప్పి కొట్టాడు.

బియ్యే స్టూడెంటుకేం చెయ్యాలో తోచలేదు. కింద జేబులూ, మీద జేబులూ వెదికి దొరికిన చిల్లరంతా లెక్కపెట్టి పదిహేను రూపాయలుంచే సన్నాసప్పుడి చేతిలో పెటాడు.

"ఇంతకంటే నా దగ్గర పైసాలేదు. ఆ కోడిపెట్ట మీరే వుంచుకోండి. కాలేజీకి లైటైపోయింది. నన్నొదిలేయండి" అంటూ సైకిలెక్కాడు. కోడిపెట్టా, కబ్బా పట్టుకొని "ఇయ్యాల మనకి బాగుంది" అనుకుంటూ రావుడమ్మా, సన్నాసప్పుడూ అక్కడున్న ఆడా, మగా అందరివంకా ఓ కృతజ్ఞత చూపు పారేసి ఇంటి కొచ్చేశారు.

అంతవరకూ వాకిట్లో నిల్చుని జరిగింతంతా విన్న సిట్టిబాబు వాళ్ళయ్యతో—

"అద్రేయ్యా! ఆ బాబుకంత పేసి పెట్టేసినావు? ఆ కునికిన కోడిపెట్టని రేపెలాగా సంపిత్తా మనుకున్నాం గదేటి? అయినా అది పదిరూపాయి విలువైనా సేత్తాద్రేటా?" అన్నాడు అమాయకంగా.

అవును మరి వాడికేం తెలుసు? సమాజంలో పైనుంచి కిందివరకూ అన్ని వర్గాల్లోనూ ఏదో రూపంలో ఉన్న దోపిడీ మనస్తత్వాన్నీ. దాన్ని పెంచి పోషిస్తున్న వ్యవస్థనీ అర్థం చేసుకోవడానికి వాడి వయస్సెంత?

వాడి మాటలకు సన్నాసప్పుడు "ఓడె(రి బాగులోడా! ఇలాగైతే నువ్వు బతికినట్టే!" అంటూ జాలిగా వాడి తల నిమిరాడు.

అయ్య కళ్ళలోకి వింతగాచూస్తున్నాడు సిట్టిబాబు. ఎనిమిదేళ్ళ సిట్టిబాబు - ఏవీ తెలీని సిట్టిబాబు -భవిష్యత్తులోకి అమాయకంగా అడుగు పెట్టబోతున్న సిట్టిబాబు—

వాడి చూపులు వ్యవస్థను 'స్టడీ' చేస్తున్నట్టుగా వున్నాయి.

త్వరగా
మూలశంకకు
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా? తీవ్రంగా దురద వుందా? మలంతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స, ఎంత మాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారి తీసి-శస్త్రచికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేచనము. 108 దేశాలలో వైద్యు లందరూ శిఫారసు చేస్తున్నారు! హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది-విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు.

గమనించండి సకాలంలో హెడెన్‌సా చికిత్స చేసుకుంటే ముమ్ముందు శస్త్రచికిత్స అవసరముండదు!

3627 TG